క్లుప్తంగా

వివాహ వేడుకల్లో పీఎన్‌ఆర్


పెళ్లి వేడుకలో పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదివారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన శుభ కార్యాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్లో కొడంగల్‌కు చెందిన అరిగె అనంత ప్రసాద్ కూతురు పెళ్లికి హాజరై వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ మధుయాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, అరిగె వెంకట రత్నం, అరిగె ఓం, బొంకురు నరేశ్, రుద్రారం మధు, ఉడిమేశ్వరం మధు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


ఎన్కేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పరిశీలిస్తున్న నాయకులు

పూడూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని పీఏసీఎస్ చైర్మన్ సతీష్ రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి, పూడూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం తదితర పథకాలను అమలు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లను కూడా మంజూరు చేస్తుందని తెలిపారు.

గోర్ సేనా జిల్లా అధ్యక్షుడిగా రమేశ్ రాథోడ్


రమేశ్ రాథోడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: బంజారాల గోర్ సేనా సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని టేకుల గడ్డ తండాకు చెందిన రమేశ్ రాథోడ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాందాస్ నాయక్ రెండేళ్ల క్రితం పదవి నుంచి విరమంచుకోగా జిల్లా ఉపాధ్యక్షుడిగా కొన సాగుతున్న రమేశ్ రాథోడ్‌ను వికారాబాద్ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లానాయకులు రవినాథ్ నాయక్, హర్యానాయక్, మోహన్, శివరాం, రవినాథ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

బండమీదిపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు రూరల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం బండమీదిపల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌జీఎస్ కింద రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాండూరు–జహీరాబాద్ పీడబ్ల్యూరోడ్డు నుంచి హన్మాన్ దేవాలయం వరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నారన్నారు. కర్ణాటక సరిహద్దులోని బండమీదిపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గౌరాల మల్లప్ప, బెన్నూరు రాములు, నత్తి పండరి, రాంచెందర్, చిరంజీవి, నర్సిములు, మల్లేశ్, పరమేశ్, నరేశ్, సంగప్ప, రాములు పేర్కొన్నారు.

స్కూల్ నిర్మాణానికి ఆర్థిక శాఖ ఆమోదం

తాండూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ముందడుగు పడింది. తెలంగాణ ప్రభుత్వం ఆదివారం రూ.200 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఒక ప్రకటనలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కృతజ్ఞత తెలిపారు. దౌలాపూర్ వద్ద ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ స్కూల్ పూర్తయితే తాండూరు నియోజకవర్గంలోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకే ఇది ఉపకరిస్తుందని పేర్కొన్నారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం.!

ఇదేం శ్మశానవాటిక ?

- రూ. లక్షలు వెచ్చించారు వదిలేశారు
- నేటికీ అధికారికంగా ప్రారంభానికి నోచుకోని వైనం
- బీటలు వారి కూలేందుకు సిద్ధం
- పట్టించుకోని అధికారులు


బీటలు వారిన మృతదేహాలను కాల్చే ఘటాలు

దుద్యాల్: గత ప్రభుత్వం ప్రతి పల్లె, గ్రామం తేడా లేకుండా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన శ్మశాన వాటికలు 5 ఏళ్లు గడవక ముందే శిథిలావస్థకు చేరాయి. మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో రూ.10 లక్షల 50వేలతో నిర్మించిన వాటిక నేటికి అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణ పనులు పూర్తి చేసి పట్టుమని ఐదేళ్లు కూడా గడవక ముందే గదులు, శవాన్ని కాల్చే కట్టలు బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గత ప్రభుత్వం అత్యున్నత ప్రమాణాలతో, గట్టిదనంతో నిర్మించామని గొప్పలు చెప్పుకొచ్చింది. కానీ అలాంటి నాణ్యతా ప్రమాణాలు చేపట్టలేదని తేటతెల్లమైంది. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఆలేడ్ గ్రామంలో పాటించలేదనే విషయం అక్కడి శ్మశాన వాటికను చూస్తే అర్థమవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మిస్తే కూలేందుకు తయారవ్వడం విడ్డురంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గుడిసెలు వేసుకున్నా అవి కొన్ని సంవత్సరాల వరకు చెక్కు చెదరకుండా ఉంటాయని చెబుతున్నారు. కానీ గత ప్రభుత్వం చేపట్టిన నిర్మాణపనులను అధికారులు పర్యవేక్షించకపోవడంతోనే కాంట్రాక్టర్లు సక్రమంగా పనులు చేయించలేదని చెబుతున్నారు. ఇంత జరిగినా ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. కానీ ఆలేడ్ వాటిక మాత్రం అంత కన్న దారుణంగా తయారైందని అప్పుడే పగుళ్లు ఏర్పడడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. నాణ్యత లేకుండా నిర్మించిన ఈ శ్మశానవాటికకు అధికారులు ఎలా నిధులు మంజూరు చేశారో వారికే తెలియాలని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.


బీటలతో శ్మశానవాటిక విశ్రాంతి గది


అసంపూర్తిగా మరుగుదొడ్లు, నీటిసంపు

పొదుపు సంఘాలతో ఆర్థికంగా ఎదగొచ్చు


మహిళా సంఘాల సభ్యులతో సమీక్ష సమావేశంలో సీసీ శ్రీనివాస్

కుల్కచర్ల: పొదుపు సంఘాలను సక్రమంగా నిర్వహించి మహిళలు ఆర్థికంగా ఎదగొచ్చని మహిళా సమాఖ్య సీసీ(కమ్యూనిటీ కోఆర్డినేటర్) శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం అంతారం గ్రామంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన గ్రామ సంఘాన్ని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు అతితక్కువ వడ్డీరేట్లతో అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. మహిళా సంఘాల బలోపేతానికి కీలకంగా వ్యవహరించాలన్నారు. తీసుకున్న రుణాలను సరైనవిధంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటిని తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


బొడ్రాయిప్రతిష్ఠాపన పూజలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు హరిప్రియ తదితరులు

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు హరిప్రియ

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు హరిప్రియ పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ భక్తిమార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. మండల పరిధిలోని చిగురాల్‌పల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయి కార్యక్రమ నిర్వహణకు రూ.42వేలు విరాళం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠించడం శుభపరిణామమన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా నేటి తరానికి భక్తిపైశ్రద్ధ పెరుగుతుందన్నారు. ముఖ్యంగా యువత భక్తి మార్గాన్ని ఎంచుకుంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో ప్రయణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహాల ప్రతిష్ఠ

పూజలో ఎమ్మెల్యే యాదయ్య


పూజలో ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

నవాబుపేట: మండల పరిధిలోని నారగూడ గ్రామ సమీపంలోని హనుమాన్ మందిరం వద్ద ఆదివారం నవగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి, నవగ్రహాలకు ఉదయం శాంతి పాఠం, మండప ఆవాహిత, ఆది దేవతల, సోడాషోపర పూజ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠాపన, మహాపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలో ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నవగ్రహాల దాత పాండురంగారెడ్డి, కుటుంబ సభ్యులు మల్లారెడ్డి, మాణిక్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పాండురంగారెడ్డి, మాజీ సర్పంచులు పర్మయ్య,, తిరుపతి రెడ్డి, గ్రామ పెద్దలు మైపాల్ రెడ్డి, నాగిరెడ్డి, మాణిక్ రెడ్డి, రఘునందన్ రెడ్డి, చంద్రా రెడ్డి, అనంతయ్య, హనుమయ్య, పరమయ, సంజీవయ్య, పూజారులు కళ్యాణ్ రావు శ్రీ పాల్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలతోనే విజ్ఞానం


విహారయాత్రలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

దౌల్తాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిలుగౌడ్

దౌల్తాబాద్: విహార యాత్రలతోనే విజ్ఞానం పెంపొందుతుందని దౌల్తాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిలుగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజ్ఞానవిహార యాత్రలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలం, బుద్ధవిగ్రహం, సమతామూర్తి, ట్యాంక్ బండ్ తదితర ప్రదేశాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల ప్రాముఖ్యతను ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు బోటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శానమ్మ, రేణుక, రమేశ్, వెంకటేషం, చంద్రశేఖర్, సీఆర్‌పీ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం ఇందూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు మాధురి, నర్సిములు, ఎల్లప్ప, బస్వరాజ్‌లను శాలువ కప్పి పూలమాల వేసి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. చదువుకున్న రోజుల్లో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత హెచ్ఎం అంజయ్యతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్ర యాదవ్, పీ. శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతి గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి కోరారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణ శివారులో బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో బీజాపూర్–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ ఆలయాన్ని కృష్ణ శిలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వామి, కుమార స్వామి, వినాయకుడి ఆలయాల నిర్మాణం చివరి దశకు చేరుకు న్నట్లు వివరించారు. ఆలయ నిర్మాణంలో భక్తు లు, దాతల సహకారం అవసరమని పేర్కొ న్నారు.

పట్నం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ కేటాయించాలి

దుద్యాల్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్యే కోటలో ఎమ్మెల్సీ కేటాయించాలని మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం కేటీఆర్‌కు లేఖ రాశారు. ఈ లేకలో వివరాలు ఇలా ఉన్నాయి.. దుద్యాల్ మండలంలో కంపెనీల ఏర్పాటుకు రైతుల భూములు బలవంతంగా లాక్కుంటుంటే పోరాటం చేశారని, రైతుల కోసం తను చేయని నేరానికి కూడా జైలుకు వెళ్లొచ్చారని, కొడంగల్ నియోజకవర్గంలో ప్రజలకు ఎళ్లవేళల అందుబాటులో ఉంటున్నారని, నిరంతరం ప్రజల పక్షానా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన ప్రజల కోసం ముందుడి చేస్తున్న పోరాటాలనైనా గుర్తించి ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టాలని మండల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేక రాసిన వారిలో కొడంగల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగా శ్రీనివాస్, ఇతర నాయకులు ఉన్నారు.

మోమిన్‌పేట సీఐ బదిలీ

మోమిన్‌పేట: మోమిన్‌పేట సీఐ నవీన్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఐజి కార్యాలయంలోని వెంకట్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.


వెంకట్ (సీఐ)

నేడు మహిళా దినోత్సవ వేడుకలు

తాండూరు టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తాండూరు పట్టణంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కొడంగల్‌లోని ఎస్వీఆర్‌గార్డెన్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

తగ్గిన భూగర్భజలం ఎండిన పొలం


వరిపొలాన్ని కోస్తున్న రైతు

దౌల్తాబాద్: ఎండల తీవ్రత పెరగడంతో భూగర్భ మట్టం తగ్గి బోర్లలో నీరు ఇంకుతున్నాయి. పంట చేతికందే సమయంలో నీరందక ఎండిపోతున్నాయి. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కామని వెంకటమ్మ బోరుకింద ఎకరా వరి సాగుచేస్తుంది. బోరులో నీటి మట్టం తగ్గడంతో పొలాన్ని పచ్చిగా ఉన్నప్పుడే కోసి పశువులకు మేతగా వేస్తున్నారు. మండలంలో చాలా బోర్లలో నీటిమట్టం తగ్గడంతో పొలాలు ఎండుతున్నాయి. వాటికి నీరందకపోవడంతో పచ్చిగా ఉన్నప్పుడే కోసి పశువులకు మేతగా వేస్తున్నారు.

ప్రారంభానికి నోచని మీటింగ్ హాల్



బంట్వారం: రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన మీటింగ్ హాల్ ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోవడం లేదు. బంట్వారం మండల కేంద్రంలో దాదాపు 15 ఏళ్ల కిందట మీటింగ్ హాల్ నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో రంగారెడ్డి జెడ్పీ చైర్ పర్సన్‌గా పట్నం సునీతారెడ్డి జెడ్పీ నిధులను మంజూరు చేయించి భవన నిర్మాణ పనులు పూర్తి చేయించారు. దీంతో అందులో చిన్న పాటి పనులు మిగిలి ఉండడంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగానే పడి ఉంది. ఇదిలా ఉండగా ఇదే భవనానికి అదనంగా మరో రూ. 5లక్షలు జెడ్పీ నిధులను ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్‌గా ఉన్న సమయంలో సునీతారెడ్డి ఏడేళ్ల కిందట మంజూరు చేయించారు. అయినప్పటికీ అసంపూర్తి పనుల వల్ల నేటికి పూర్తి కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యాదవ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సన్మానిస్తున్న జిల్లా కమిటీ నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని గౌరారం గ్రామంలో అఖిల భారత యాదవ సంఘం గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా దశరథ్, ఉపాధ్యక్షులుగా అనంతయ్య, హన్మంతు, కోశాధికారిగా మొగులయ్య, కార్యదర్శులుగా నర్సిములు, ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు పుర్ర రాఘవేందర్ యాదవ్ హాజరై మాట్లాడారు. యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని, కుల అభివృద్ధికి సమష్టిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సిములు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు నర్సిములు, నాయకులు అంజిలయ్య, వెంకటయ్య తదతరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలి


విజేతలకు బహుమతులు అందజేసిన నాగలక్ష్మి

వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు నాగలక్ష్మి

తాండూరు టౌన్: మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని వాసవి మహిళా సంఘం అధ్యక్షురాలు కోట్రిక నాగలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఏ రంగంలోనైనా తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను తీవ్రంగా ఖండించడంతో పాటు మహిళలకు రక్షణ కల్పించే చట్టాలను పకడ్బందీగా అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 1, 3వ తేదీల్లో మహిళలకు చెస్, క్యారమ్స్, కబడ్డీ పోటీలను నిర్వహించామన్నారు. స్వర్గీయ కోట్రిక సుశీలమ్మ జ్ఞాపకార్థం విజేతలకు జ్ఞాపిక అందజేశామన్నారు. పలు రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు మహిళలను సన్మానించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, తాటికొండ స్వప్న, మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత, వాసవి మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి మంకాల్ స్వప్న, కోశాధికారి సింగంశెట్టి శోభ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం


రుక్మిణీపాండురంగస్వామి ఉత్సవమూర్తులు


స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయ వార్షోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉత్సవాలలో భాగంగా స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కరణం నాగేశ్వరరావు భక్తులకు ఇబ్బందులు లేకుండా సంప్రదాయ పద్ధతులను అనుసరించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ అంతరాయం

మోమిన్‌పేట: మోమిన్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయాల్సి ఉండటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు. ఎన్కతల సబ్‌స్టేషన్ పరిధి మినహా మోమిన్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలోని మోమిన్‌పేట, బూర్గుపల్లి, కాస్లాబాదు, రాళ్లగూడుపల్లి, లచ్చానాయక్‌తండా, మేకవనంపల్లి, అంరాధికలాన్, అంరాధికుర్దు, కోల్కుంద, చిన్న కోల్కుంద, రావులపల్లి, చంద్రాయన్‌పల్లి, గోవిందాపూర్, మల్లారెడ్డిగూడెం, రాంనాథ్‌గుడుపల్లి, మొరంగపల్లి, వెల్‌చాల్, దుర్గంచెర్వు, ఎన్కేపల్లి, కేసారం, ఇజ్రాచిట్టంపల్లి, సయ్యద్‌అల్లిపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ వెంకటేశ్ తెలిపారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండలంలోని బాలంపేట సబ్‌స్టేషన్లో మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని బాలంపేట, సుల్తాన్‌పూర్, తిమ్మారెడ్డిపల్లి, బిచ్చాల, అంతారం గ్రామాల ప్రజలకు అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినిగదారులు గ్రహించి తమక సహకరించాలని కోరారు.

త్వరలో వీధి లైట్లు ఏర్పాటు చేయిస్తా

మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మహేందర్ రెడ్డి

మర్పల్లి: త్వరలో మర్పల్లి గెస్ట్‌హౌజ్ నుంచి కస్తూర్బా బాలికల పాఠశాల వరకు విద్యుత్ పోల్స్ బిగించి వీధి లైట్లు ఏర్పాటు చేయిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మర్పల్లి గెస్ట్‌హౌజ్ నుంచి కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లే మార్గంలో ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రాములు యాదవ్, మండల అధ్యక్షుడు సురేష్, బ్లాక్–2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో చదువుకునే విద్యార్థినులకు సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి రావడంతో రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. రోడ్డు పనులు పూర్తికాగానే త్వరలో గెస్ట్‌హౌజ్ నుంచి కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల వరకు వీధి లైట్లు వేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్, బ్లాక్–2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ జగదీశ్వర్, బీసీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు నాగేశ్ సాగర్, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, మధుకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.